క్లుప్తంగా

కాగితాలకే విలీనం పరిమితం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయాలన్న అంశాన్ని కాగితాలకే పరిమితం చేయకుండా కార్యాచరణ చేపట్టాలని నియోజకవర్గ విలీన సాధన పోరాట అఖిలపక్ష కమిటీ నాయకుడు ధూళి జయరాజు సోమవారం డిమాండ్ చేశారు. జిల్లాల విభజన సమయంలో ఈ అంశంపై అఖిలపక్ష కమిటీగా పోరాడామని గుర్తు చేశారు. ఆదివారం మండపేటలో నిర్వహించిన టీడీపీ నియోజకవర్గ మినీ మహానాడులో ఇదే అంశానికి మద్దతుగా తీర్మానం చేయడాన్ని స్వాగతిస్తున్నానన్నారు. అయితే ఈ అంశాన్ని తీర్మానం పేరుతో కాగితాలకే పరిమితం చేయకుండా కార్యాచరణ ప్రారంభించేందుకు చొరవ చూపాలని నియోజకవర్గ కూటమి ప్రజాప్రతినిధులను కోరారు. ఇతర జిల్లాల సామాజిక, గణాంక పరిస్థితులతో సంబంధం లేకుండా మండపేట నియోజకవర్గాన్ని ప్రత్యేకంగా పరిగణించి తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయాలని జయరాజు డిమాండ్ చేశారు.

సరస్వతీ పుష్కరాలకు తరలిన భక్తులు



రామచంద్రపురం డిపో నుంచి కాళేశ్వరం పుష్కరాలకు బయలుదేరిన భక్తులు

రామచంద్రపురం రూరల్: కాళేశ్వరం సరస్వతీ నదీ పుష్కరాలకు రామచంద్రపురం ఆర్టీసీ డిపో నుంచి సోమవారం రెండు బస్సుల్లో భక్తులు బయలుదేరినట్లు డిపో మేనేజర్ పేపకాయల భాస్కరరావు విలేకరులకు తెలిపారు. ఈ సూపర్ లగ్జరీ వీడియో కోచ్ ప్రత్యేక బస్సులు వరంగల్ భద్రకాళీ మాత ఆలయం, వేములవాడ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం, కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం, ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, కాళేశ్వరం మహా కాళేశ్వరుడు ఆలయం, పుష్కరస్నానం, రామప్ప దేవాలయ దర్శనం కల్పించి భక్తులకు తిరిగి రామచంద్రపురం డిపోకు తీసుకుని వస్తాయని వివరించారు.

అమ్మవార్ల ఆలయాలను సందర్శించిన చైర్‌పర్సన్



మండపేటలోని ఎల్లారమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న చైర్‌పర్సన్

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి పట్టణంలోని మున్సిపల్ మార్కెట్‌లో వేంచేసియున్న కనకమహాలక్ష్మి, ఎల్లారమ్మ అమ్మవార్ల ఆలయాలను సందర్శించారు. ఆలమూరు మండలం చింతలూరు శ్రీనూకాంబిక అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి, కానుకను సమర్పించారు.

హెచ్ఐవీపై కళాజాతా ద్వారా అవగాహన



తోటపేటలో కళాజాతా నిర్వహిస్తున్న రాంబాబు బృందం

రామచంద్రపురం రూరల్: మండలంలోని తోటపేటలో ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ ఆఫీసర్ డాక్టర్ భరతలక్ష్మి పర్యవేక్షణలో కళాజాతా ద్వారా హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఐవీ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హెచ్ఐవీ, సిఫిలిస్, గనేరియా వంటి సుఖవ్యాధులు వ్యాపించే విధానం, చికిత్సా పద్ధతులు, కండోమ్ ఉపయోగం తదితర అంశాలపై వేమవరపు రాంబాబు బుర్రకథ బృందం ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. కార్యక్రమంలో రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి లైంగిక వ్యాధుల కౌన్సిలర్ నాగబాబు, జన కళ్యాణ్ స్వచ్ఛంద సేవా సంస్థ దొరబాబు, లక్ష్మి, తోటపేట ఆశా వర్కర్లు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి జన్మనక్షత్ర పూజలు

కపిలేశ్వరపురం: అంగరలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామి జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్ర పూజలు ఘనంగా నిర్వహించారు. అంగర గ్రామానికి చెందిన సంకాబత్తుల సత్యశ్రీపట్టాభి రామయ్య, కనకదుర్గ దంపతులతో ఆలయ అర్చక బృందం సభ్యులు అభిషేకం చేయించారు. తెల్లవారు జామున స్వామిని విశేషంగా అలంకరించి పంచామృతాభిషేకం పూజలు చేశారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

మేకల పెంపకం.. ఆదాయం పుష్కలం

- సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి
- రైతులకు పశు వైద్యాధికారుల సూచనలు



మేకలు

రాయవరం: మూగజీవాల పెంపకంతో ఎన్నో లాభాలు ఉంటాయి. ముఖ్యంగా మేకల పెంపకం మంచి ఆదాయాన్ని తెచ్చిపెడుతుందని మండల పశువైద్యాధికారి ముత్యాల అరుణ సూచిస్తున్నారు. సమగ్ర యాజమాన్య పద్ధతుల్లో మేకలను పెంచే విధానాన్ని రాయవరం మండల పశువైద్యాధికారి ఎ.నాగశ్రావణి ఇలా వివరిస్తున్నారు.

రోజుకు 10 గంటల వరకు మేపాలి

మేకలు స్వల్పాహారం ఎక్కువ మోతాదులో ఎక్కువ సార్లు తీసుకుంటాయి. త్వరగా అభివృద్ధి చెందాలంటే వాటికి సరిపడా మేతను అందించాలి. ఈ క్రమంలో వాటిని రోజుకు ఎనిమిది నుంచి 10 గంటల వరకు మేపాల్సి ఉంటుంది. దీనికి మేకలు ఉంచే ప్రాంతం చుట్టూ ఖాళీ స్థలంలో గ్రాసాన్ని పెంచాలి. మేకలు ఎక్కువగా ఆకులు, అలమలు, పండ్ల తొక్కలు, కూరగాయల ఆకులను తినడానికి ఇష్టపడతాయి. అందుకే అవిశ, రావి, తుమ్మ, అల్లనేరేడు, సీమచింత, వేప, సుబాబుల్, దిరిశనం తదితర మొక్కలను నాటుకుని ఆ ఆకులను మేతగా వేస్తుండాలి. వీటితో పాటు కాయజాతిలో ఏకవార్షిక రకాలైన జొన్న, కాయజాతి పశుగ్రాసాలైన లూసర్న్, బర్సింసైట్‌లో తదితరాలను పెంచాలి. పచ్చి మేత వేసేటప్పుడు సుమారు కిలో చెట్ల ఆకులు, కిలో కాయజాతి పచ్చిమేత, మూడు కిలోల ఇతర పశుగ్రాసాలను ఇవ్వాలి.

చూడి మేకలను ఇలా..

మేకలు చూడి కట్టిన మూడు నెలల తర్వాత కడుపులోని పిల్ల పెరుగుదల ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలో చూడిమేకలకు మంచి దాణా ఇవ్వాలి. 200 నుంచి 250 గ్రాముల మిశ్రమ దాణా అదనంగా ఇవ్వాలి. దీంతో పిల్లలు ఎక్కువ బరువుతో పుడతాయి. తల్లి మేక ఆరోగ్యంగా ఉంటే పిల్లకు పాలు ఎక్కువ ఇస్తుంది.

ముర్రుపాలు బాగా తాగించాలి

పిల్లలు మేక నుంచి బయటకు వచ్చిన వెంటనే ముక్కు రంధ్రాలు, నోటిపై ఉన్న పొరలను తీసివేయాలి. బొడ్డుకు టింక్చర్ అయోడిన్ పూయాలి. పిల్లలను ఉంచే ప్రదేశంలో 10 శాతం ఫినాయిల్ చల్లాలి. ఈనిన వెంటనే పొదుగును శుభ్రంగా కడిగి, తర్వాత పిల్లలకు పాలు తాగించాలి. ముర్రుపాలు బాగా తాగిస్తే రోగ నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుంది. కాబట్టి రోజుకు మూడు నుంచి నాలుగు సార్లు పాలు తాగించాలి. రెండు నెలల వయస్సు వచ్చే వరకు తల్లిపాలు తాగించాలి. తర్వాత తల్లి నుంచి వేరు చేసి దాణా, పచ్చిమేత, లేత ఆకులు అందుబాటులో ఉంచాలి. రెండు వారాల సమయంలో 10 గ్రాముల దాణా ఇవ్వాలి. పిల్లల షెడ్ లేదా పాక శుభ్రంగా ఉంచాలి. అలా చేయక పోతే పిల్లలు నేలను నాకి అనారోగ్యానికి గురై పలు రకాల జబ్బులు వస్తాయి. మేక పిల్లల షెడ్డులో/పాకలో కాని ఉప్పు, లవణ మిశ్రమ ఇటుకలను ఏర్పాటు చేయాలి. పిల్లల దాణాలో మొక్కజొన్న, వేరుశెనగ చెక్క, గోధుమ పొట్టు, బియ్యం, నూక, జొన్నలు, లవణ మిశ్రమం ఉండేలా చూసుకోవాలి.



డాక్టర్ నాగశ్రావణి

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు మేత, నీరు, ముందు జాగ్రత్తగా టీకాలు వేయిస్తే మేకల మరణాల సంఖ్య తగ్గించవచ్చు. మేకలు బయటి ప్రాంతంలో మేస్తున్నప్పుడు తినే గడ్డి, ఇతర ఆకులు అలమలతో పాటు ఏలిక పాములు, బద్దెపురుగులు వాటి శరీరంలో చేరి పోషకాల్ని పీల్చి వేసి, అనారోగ్యానికి గురి చేస్తాయి. మూడు నెలల దాటిన మేక పిల్లలకు నట్టల నివారణ మందు తాగించాలి. పేలు, పిడుదులు, గమార్లు మొదలైనవి శరీరంలోని రక్తాన్ని పీలుస్తాయి. వీటి నివారణకు శరీరం అడుగుభాగాన పశువైద్యులు సూచించిన మందులు వాడాలి. మందులను శరీరానికి పిచికారి చేసినప్పటి నుంచి ఆరిపోయే దాకా మూతికి చిక్కంలా ఉట్టి తాడు కట్టాలి. అలా చేయక పోతే మందును నాలుకతో నాకి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది.

ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి



మండపేటలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

కపిలేశ్వరపురం (మండపేట): నిర్దేశించిన వయస్సు వచ్చిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే దిశగా సంబంధిత అధికారులు కృషి చేయాలని మండపేట నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, జిల్లా కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.కృష్ణమూర్తి ఆదేశించారు. మండపేట తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల ఓటరు నమోదు అధికారులతో సమావేశమయ్యారు. ఫారం–6, 7 , 8 లకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరణ, పరిశీలన, పరిష్కారం తదితర అంశాలపై చర్చించారు. దరఖాస్తు పరిశీలనపై వైఎస్సార్ సీపీ ప్రతినిధి యరమాటి వెంకన్నబాబు పలు సూచనలు చేశారు. సమావేశంలో వివిధ పార్టీల ప్రతినిధులు ఉంగరాల రాంబాబు, కె.కాశీ విశ్వనాథం, ఎస్.చక్రపాణి, ఎస్‌వీఎస్‌పీ ప్రకాష్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ పీపీ మెహర్ బాబా, మండపేట, కపిలేశ్వరపురం మండలాల ఓటరు నమోదు అధికారులు పి.తేజేశ్వరరావు, జి.చిన్నారావు, డిప్యూటీ తహశీల్దార్ జి.శ్రీనివాస్, రాయవరం రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ ఐ.సంధ్య, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ ఎం. శ్రీనివాసరావు పాల్గొన్నారు

తూనికలు, కొలతల శాఖ ఆధ్వర్యంలో అవగాహన



రామచంద్రపురం ఆర్టీసీ డిపో వద్ద తూనికలు, కొలతలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం ఆర్టీసీ డిపో ప్రాంగణంలో తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ కుటుంబరావు ఆధ్వర్యంలో సోమవారం వస్తు వినియోగదారులు, వస్తు విక్రయదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిపో మేనేజర్ పేపకాయల భాస్కరరావు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ కుటుంబరావు వినియోగదారులు ఏ వస్తువు కొన్నా సరైన ధర, కొలత, గడువు తేదీ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి కొనుగోలు చేయాలని సూచించారు. అదే విధంగా విక్రయదారులు ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే జరిమానా విధించడం జరుగుతుందని హెచ్చరించారు. డిపో మేనేజర్ భాస్కరరావు మాట్లాడుతూ చిన్నపిల్లలు తినే బిస్కెట్ ప్యాకెట్లు గడువు తేదీని తప్పనిసరిగా సరిచూసుకోవాలని సూచించారు. వినియోగదారుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తే టోల్‌ఫ్రీ నంబరు 1967పై ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం వినియోగదారులకు తెలుసుకోవాల్సిన అంశాలపై ముద్రించిన కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో తూనికలు, కొలతల శాఖ సిబ్బంది, ఆర్టీసీ సిబ్బంది, విక్రయదారులు, వినియోగదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కపిలేశ్వరపురం: అంగర 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో బ్రేకర్ల నిర్మాణ పనుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్టు విద్యుత్ శాఖ రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు సోమవారం తెలిపారు. సబ్ స్టేషన్ వద్ద బ్రేకర్ల నిర్మాణ పనులు నేపథ్యంలో కపిలేశ్వరపురం, అంగర, టేకి, వెదురుమూడి, పడమర ఖండ్రిక, మాచరమట్లలు, శ్రీరామపురం, నల్లూరు, కాలేరు, సుభద్రాపురం, వల్లూరు, నేలటూరు గ్రామాల్లో ఉదయం 7 గంటలు నుంచి మధ్యాహ్నం 12 గంటలు వరకూ విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

కె.గంగవరంలో..

కె.గంగవరం: మండలంలో ఈ నెల 21, 22 తేదీల్లో మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ రామచంద్రపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కె.గంగవరం మండలంలోని పామర్రు, అముజూరు, కూళ్ల, తామరపల్లి, సత్యవాడ, పాణింగపల్లి, యండగండి గ్రామాలతో పాటు కపిలేశ్వరపురం మండలంలోని కోరుమిల్లి, మాచర, వాకతిప్ప, నాగులచెరువు గ్రామాల ప్రజలకు జరుగుతున్న అసౌకర్యానికి సహకరించాలని కోరారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఐక్యత

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: క్షేత్ర స్థాయిలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల మధ్య ఐక్యతను పెంచుతాయని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. నాగులచెరువు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ గోపాలకృష్ణ స్వామి శిఖర, విగ్రహ ప్రతిష్ఠ, ఆలయ ప్రాంగణంలో శ్రీ వీరాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో దేవతామూర్తులను దర్శించుకున్నారు. ఆయనకు మాజీ సర్పంచ్ మేడిశెట్టి గోవిందు, మేడిశెట్టి త్రిమూర్తులు, చొల్లంగి సురేష్, మేడిశెట్టి సూర్యప్రకాష్ ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం, సర్పంచ్ వాసంశెట్టి సత్యనారాయణ ఆలయాన్ని సందర్శించారు. గ్రామస్తుల సహకారంతో ఆలయ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో జీవ ధ్వజస్తంభంతో ఆలయ ప్రాంగణం నిర్మించారు. దూరపు ప్రాంతాల్లో స్థిరపడిన గ్రామానికి చెందిన వారు ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని ఇష్ట దైవానికి పూజలు చేశారు. ఆలయం వద్ద భారీ అన్న సమారాధన చేశారు. కార్యక్రమంలో మేడిశెట్టి నాగరాజు, మేడిశెట్టి సిద్ధయ్య, ఇల్ల దుర్గారావు, చింతపల్లి రాజు బ్రదర్స్, గంజా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు



నాగులచెరువులో స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

'పుచ్చలపల్లి'కి ఘన నివాళి



శీలలంకలో సుందరయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కౌలు రైతు సంఘం నాయకులు, కూలీలు

కాజులూరు: స్వాతంత్ర్య సమరయోధుడు, పార్లమెంట్ తొలి ప్రతిపక్షనేత పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను నేటి తరం నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని ఏపీ కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.రాజశేఖర్ అన్నారు. సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి పురస్కరించుకుని మండలంలోని చేదువాడ, శీలలంక, శీల గ్రామాల్లో కార్మికులు, వ్యవసాయ కౌలురైతు సంఘం నాయకులు, కూలీలు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. చేదువాడలో ఏపీ కౌలు రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు అధ్యక్షతన జరిగిన సభలో రాజశేఖర్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ తొలితరం నేతగా పేరు తెచ్చుకున్న సుందరయ్య పార్లమెంట్‌లో మహిళల హక్కుల కోసం నిరంతరం పోరాడారన్నారు. ఎంపీగా ఉన్నప్పుడు సైతం సైకిల్‌పై పార్లమెంట్‌కు వెళ్లిన ఆయన తన యావదాస్తి పేదలకు పంచిపెట్టారన్నారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు దండంగి సమర్పణరావు, బుడితి ప్రభాకరరావు, పి.భైరవమూర్తి, మహాలక్ష్మీరావు, పెంకే సూర్యనారాయణ, కురుపూడి భూచక్రం తదితరులు పాల్గొన్నారు.



మండపేటలో సుందరయ్యకు నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

విలువలతో కూడిన జీవితానికి ప్రతీక సుందరయ్య

కపిలేశ్వరపురం (మండపేట): విలువలతో కూడిన రాజకీయ జీవితానికి ప్రతీకగా పుచ్చలపల్లి సుందరయ్య చరిత్రలో నిలిచారని సీఐటీయూ జిల్లా కోశాధికారి కె.కృష్ణవేణి అన్నారు. సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా సోమవారం మండపేట పట్టణంలో పలు సేవా కార్యక్రమాలను చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. అనంతరం నిర్వహించిన సుందరయ్య సంస్మరణ సమావేశంలో కృష్ణవేణి మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతరం ఏర్పడిన పార్లమెంట్‌లో తొలి ప్రతి పక్ష నేతగా సుందరయ్య అనేక సామాజిక అంశాలపై చర్చించారన్నారు. తన ఆస్తిని కమ్యూనిస్టు పార్టీకి అప్పగించి తుది శ్వాస విడిచే వరకూ అతి సామాన్యమైన జీవితాన్ని గడపడాన్ని నేటి రాజకీయ నాయకులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.నరేంద్రకుమార్, బి.కొండ, సీహెచ్.రాణి, ఎం.సూర్యకుమారి, బి.రాజు, కె.మణికంఠ, దయానందరావు, 108 ఉద్యోగుల సంఘం నాయకుడు రాజు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయానికి శంకుస్థాపన

కె.గంగవరం: మండలంలోని భట్లపాలిక గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ చేతుల మీదుగా సోమవారం శంకుస్థాపన నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ యలమంచిలి పద్మావతి, సత్యనారాయణ, కుందూరు సర్పంచ్ పంపన సత్యానందం, బొక్కా భానుమూర్తి, మండల అధ్యక్షుడు పెట్టా శ్రీనివాసరావు, యువజన కార్యదర్శి కట్టా తిరుమలరావు, పద్మపురాజు, ఇళ్ల గంగాధావు, మేడిశెట్టి అర్జునరావు, శెట్టిబలిజ సంఘ నాయకుడు నరాల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పోస్టుల్లో నూర్‌బాష్‌లకు మొండిచేయి



షేక్ అలీఖాన్ బాబా

కపిలేశ్వరపురం (మండపేట): ఏడాది కాలంలో ప్రకటించిన నామినేటెడ్ పోస్టుల్లో నూర్‌బాష్ దూదేకులకు కూటమి ప్రభుత్వం మొండి చేయి చూపించిందని మాజీ షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అలీఖాన్ బాబా సోమవారం ఓ ప్రకటనలో అన్నారు. కనీస ప్రాధాన్యాన్ని కూడా ఇవ్వకుండా నూర్‌బాష్ దూదేకుల ముస్లింలకు కూటమి ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. ఎన్నికల సమయంలో నూర్‌బాష్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామంటూ ఇచ్చిన హామీని సైతం నెరవేర్చలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో నూర్‌బాష్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు ఇతర కార్పొరేషన్‌లలో సైతం నూర్‌బాష్ సామాజిక వర్గీయులకు స్థానం ఇచ్చారన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నలుగురు నూర్‌బాష్ దూదేకుల కులస్తులకు రాష్ట్రంలో నాలుగు కార్పొరేషన్లకు డైరెక్టర్లుగా నియమించిన ఘనత అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు.

కన్నులపండువగా రావులమ్మ జాతర



రావులమ్మ తల్లి

అంబాజీపేట: కె.పెదపూడి గ్రామంలో వేంచేసిన రాజరాజేశ్వరి రావులమ్మ అమ్మవారి జాతర మహోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి కన్నుల పండువలా నిర్వహించారు. అమ్మవారి పూజ ఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. జాతరలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. మంగళవారం అమ్మవారి తీర్థం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా సత్తెమ్మ తల్లి జాతర

అయినవిల్లి: గ్రామదేవతగా పూజలందుకుంటున్న సత్తెమ్మతల్లికి సోమవారం జాతర వైభవంగా జరిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. అమ్మవారిని వేకువజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు దర్శించి కానుకలు మొక్కులు చెల్లించారు. చలివిడి, బెల్లం పానకం, వడపప్పు నైవేద్యంగా భక్తులు అమ్మవారికి సమర్పించారు. ఆలయాన్ని, అమ్మవారికి పుష్పాలతోను, విద్యుత్ దీపాలంకరణలో కనుల విందుగా అలంకరించారు. అమ్మవారికి గ్రామోత్సవం జరిపారు. డప్పు వాయిద్యాలు, గరగ నృత్యాలు ఏర్పాటు చేశారు. మంగళవారం భారీగా తీర్థం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

లో ఓల్టేజ్ సమస్య పరిష్కారం

సాక్షి ఎఫెక్ట్

కపిలేశ్వరపురం: అంగర గ్రామంలోని రాజమ్మ కాలనీలో లో ఓల్టేజీ సమస్య పరిష్కారమైంది. ఆదివారం 'సాక్షి' దినపత్రికలో 'లో ఓల్టేజీతో యాతన' శీర్షికన వార్త ప్రచురితమైంది. సమస్యపై సోమవారం అంగర విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ ఎస్.సత్యనారాయణ స్పందించారు. అంగర ఇన్‌చార్జి జూనియర్ లైన్‌మేన్ బీఎస్ రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో కాలనీలోని అమ్మవారి ఆలయం సమీపంలోని స్తంభానికి జేసీబీ సాయంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చారు. సమీప విద్యుత్ లైన్లను నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌కు అనుసంధానం చేయడం ద్వారాలో ఓల్టేజీ సమస్యను పరిష్కరించారు. సమస్యను వెలుగులోకి తీసుకొచ్చిన 'సాక్షి'కి, స్పందించి పరిష్కరించిన ఏఈ సత్యనారాయణ, లైన్‌మేన్ రాజేష్‌కుమార్‌లకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.



అంగర రాజమ్మ కాలనీలోని స్తంభానికి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చుతున్న సిబ్బంది

ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో రాఘవరావుకు స్థానం



విజయవాడలో ధ్రువీకరణ పత్రాలను అందుకుంటున్న రాఘవరావు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణానికి చెందిన తెలుగు పండితుడు నక్కిన వీర రాఘవరావుకు ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఎలైట్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించింది. ఈ అవార్డులను సోమవారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో అందుకున్నారు. ఆయా అవార్డులకు సంబంధించిన పతకాలు, జ్ఞాపికలు, ధ్రువీకరణ పత్రాలను రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా మండలి విషయ నిపుణుడు ఎం.వెంకట కృష్ణారెడ్డి, ఆయా సంస్థల ప్రతినిధుల చేతుల మీదుగా అందుకున్నారు. రాఘవరావు తెలుగు ఉపాధ్యాయుడిగా, పాఠ్యపుస్తక రచయితగా, కవులు, రచయితలపై పరిశోధన వ్యాసాలు రాసి సాహిత్య కృషి చేస్తున్నారు.

వైభవంగా బాలాజీ మాస కల్యాణం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి మాస కల్యాణం సోమవారం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో వేద మంత్రాలతో స్వామి వారి కల్యాణ ఘట్టాన్ని వైభవంగా జరిపించారు. విశేష సంఖ్యలో భక్తులు కల్యాణోత్సవంలో కర్తలుగా పాల్గొని స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఈ కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు. స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ప్రత్యేక దర్శనం కల్పించారు. స్వామి వారి దర్శనానికి భారీ సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో కోలాహలంగా మారింది. స్వామి వారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఏలూరుకు చెందిన రంబా చంద్రశేఖర్, రమ్య దంపతులు రూ.10,116 విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని ఆలయ పర్యవేక్షకులు సత్యమూర్తికి అందజేశారు. దాతకు పర్యవేక్షకులు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.



బాలబాలాజీ స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పవర్ టిల్లర్ల పంపిణీ

రాయవరం: వెంటూరులో సోమవారం రైతులకు పవర్ టిల్లర్లను పంపిణీ చేశారు. స్థానిక సచివాలయం వద్ద మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చేతుల మీదుగా రైతులకు పవర్ టిల్లర్లు, రోటావేటర్స్, దుక్కు సెట్లు, బ్యాటరీస్ స్ప్రేయర్లు పంపిణీ చేశారు. సమావేశంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లాడుతూ రైతులు ఆధునిక సాంకేతిక పద్ధతుల్లో వ్యవసాయం చేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ మాట్లాడుతూ 2024–25 యాంత్రికీకరణ పథకంలో భాగంగా రెండో విడతలో 23 పవర్ టిల్లర్ల పంపిణీ చేసినట్టు తెలిపారు. మండల పరిధిలో రూ.75.87 లక్షల విలువైన 42 యంత్ర పరికరాలను అందజేస్తున్నట్టు తెలిపారు. ఇందులో రూ.32.82 లక్షలు ప్రభుత్వ సబ్సిడీ 40శాతం రాయితీగా ఇచ్చామన్నారు. ఒక్కో పవర్ టిల్లర్ ఖరీదు రూ.2,29,500 కాగా, సబ్సిడీ పోగా రైతు రూ.1,29,500 చెల్లించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వాసంశెట్టి వెంకట్రావు, మాజీ సర్పంచ్ రిమ్మలపూడి వేణుగోపాలదొర, తహసీల్దారు ఐ.పి.శెట్టి, ఎంపీడీవో ఎస్.కీర్తిస్పందన తదితరులు పాల్గొన్నారు.

చేనేత వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

సఖినేటిపల్లి: చేనేత సహకార సంఘాలను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని చేనేత సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సఖినేటిపల్లి మండలం మోరిలో సోమవారం చేనేత విభాగం నాయకుల సమావేశం జరిగింది. సమావేశంలో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, మోరి చేనేత సొసైటీ మాజీ అధ్యక్షులు జాన శంకరరావు పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వాకం వల్ల చేనేత వ్యవస్థలు నిర్వీర్యం అవుతున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు లేదా పాలక మండలి నియమించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అనేక కార్పొరేషన్లకు పాలక మండలి నియమించి దేవాంగ కార్పొరేషన్‌కి పాలక మండలి ఏర్పాటు చేయకపోవడంతో.. దేవాంగులపై వివక్ష చూపుతున్నారని ఆయన ఆరోపించారు. చేనేత వర్గంలో పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు చేసి మిగతా చేనేత కార్పొరేషన్లను ప్రకటించకపోవడం దీనికి తార్కాణమన్నారు. అలాగే దేవాంగ కార్పొరేషన్ పాలక మండలిని వెంటనే నియమించాలని కోరారు. ఆప్కో చైర్మన్‌ని నామినేట్ చేసి ఇంతవరకు జీఓ ఇవ్వకపోవడం దారుణమన్నారు. గత ప్రభుత్వంలో నేతన్న నేస్తం ద్వారా మగ్గం ఉన్న వారికి ఏడాదికి రూ.24 వేలు ఇచ్చి ఆదుకున్నారనీ, ఆ పథకాన్ని కూటమి ప్రభుత్వం అమల్లోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ చేనేత విభాగం నియోజక వర్గ అధ్యక్షుడు ఇనుమర్తి వీర నాగరాజు, నాయకులు కారుపర్తి భాస్కర నాగేశ్వరరావు, చింతా సుధాకర్, లక్కింశెట్టి వీవీ సత్యనారాయణ, రామారావు, కందనాల ముత్యాలరావు, బట్టు దుర్గారావు, లక్కింశెట్టి ఏసు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ జాన శంకరరావు